ప్రజల అండతో ఎంపీగా విజయం సాధిస్తా



దానం సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన మహ్మద్ ముస్తాఫా అలీ



వడ్డెరసంఘం నేతలతో దానం నాగేందర్



ప్రేమ్‌నగర్‌లో ఎన్నికల ప్రచారం చేస్తున్న దానం నాగేందర్, వీహెచ్ తదితరులు

● సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్

బర్కత్‌పుర, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాల ప్రజల అండతో ఎంపీగా విజయం సాధిస్తానని, దీనిని బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు అడ్డుకోలేవని కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి దానం నాగేందర్ అన్నారు. శనివారం అంబర్‌పేట నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ నేత మహ్మద్ ముస్తాఫా అలీతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు దానం సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబర్‌పేటలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, సికింద్రాబాద్ ఎంపీగా బీజేపీ కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నా అంబర్‌పేట నియోజకవర్గం అభివృద్ధి చెందలేదని అన్నారు. అంబర్‌పేట నియోజకవర్గంలో సమగ్రాభివృద్ధి కోసం ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ వి.హనుమంతరావు, అంబర్‌పేట నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ సి.రోహిణ్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు దిడ్డి రాంబాబు, పులి జగన్, నారాయణస్వామి, నాయకులు లక్ష్మణ్‌యాదవ్, భావి ధన్‌రాజ్, సుదర్శన్‌తోపాటు కాంగ్రెస్‌లో చేరిన వారిలో నవాజ్, ముబాసీర్, అక్బర్, ఇమ్రాన్, అమిద్, తౌఫిక్ తదితరులు ఉన్నారు.

వడ్డెర సంఘం మద్దతు కోరిన దానం

చిక్కడపల్లి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ శనివారం వడ్డెర సంఘం నేతలను కలిసి వారి కుల మద్దతు కోరారు. వచ్చేనెల 13న జరిగే ఎన్నికల్లో హస్తం గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా వడ్డెర్ల ఆత్మగౌరవ భవన ట్రస్టు చైర్మన్ జెరిపేటి సత్యనారాయణరాజు, వైస్‌చైర్మన్ ఎత్తరి అంతయ్య సీనియర్ నాయులు జె రాములు మాట్లాడుతూ రాష్ట్రంలోని వడ్డెర్ల మద్దతు సికింద్రాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌కు ఉంటుందని స్పష్టం చేశారు.

అంబర్‌పేటలో దానం ప్రచారం

అంబర్‌పేట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దానం నాగేందర్ శనివారం అంబర్‌పేట డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ హస్తం గుర్తుపై ఓటు వేయాలని ఆయన కోరారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. మాజీ ఎంపీ వి. హనుమంతరావు మాట్లాడుతూ పేద ప్రజలకు కాంగ్రెస్ పార్టీతోనే న్యాయం జరుగుతుందన్నారు. ఎంపీ ఎన్నికల్లో దానం నాగేందర్‌కు ఓట్లు వేసి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం అంబర్‌పేటలోని ఓ టిఫిన్ సెంటర్‌లో బండ సూరీతో కలిసి అల్పాహారం తింటున్న కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి దానం నాగేందర్

మరోసారి ఎంపీగా గెలిపించండి



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

బర్కత్‌పుర, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట బిడ్డను మరొకసారి ఎంపీగా గెలిపించాలని సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. శనివారం కాచిగూడ డివిజన్‌లోని బర్కత్‌పుర గోకుల్‌దామ్ అపార్ట్‌మెంట్ వద్ద ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నానని ఎలాంటి అవినీతి, అక్రమ ఆరోపణలు లేకుండా నిజాయితీతో ప్రజలకు సేవలందిస్తున్నానని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, కోశాధికారి సూర్యప్రకాష్‌సింగ్, నాయకులు ఎక్కాల కన్నా, కృష్ణకుమార్, దిలీప్‌గుప్తా, అరవింద్, బల్వీర్, క్షీరసాగర్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

అభినందనలు

● జీవీఆర్ కరాటే అకాడమీ వ్యవస్థాపకుడు డాక్టర్. జిఎస్.గోపాల్‌రెడ్డి ఈనెల 24న 20 సెకండ్లలో 24 కిక్‌లతో 24 నాపరాళ్లను పగులగొట్టి 24 వరల్డ్ రికార్డులు సాధించారు. ఈ సందర్భంగా ఆయనను శనివారం కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి అభినందించారు.

అరవింద్ కేజ్రీవాల్‌ను విడుదల చేయాలి

● ఆప్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్. దిడ్డి సుధాకర్

కవాడిగూడ, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : అక్రమ కేసులతో అరెస్ట్ చేసిన ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను బేషరతుగా విడుదల చేయాలని ఆప్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్. దిడ్డి సుధాకర్ డిమాండ్ చేశారు. కేజ్రీవాల్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన బైక్ ర్యాలీ శనివారం నగరానికి చేరుకుంది. ఈ ర్యాలీకి సుధాకర్ స్వాగతం పలికి మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో రాజకీయంగా దెబ్బతీయడానికే కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేశారని ఆరోపించారు. ఈడీ కేసులు పెట్టి ప్రతిపక్షాలను వేధిస్తున్న బీజేపీని ప్రజలు ఓడించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆప్ నాయకులు రాముగౌడ్, మనోజ్‌కుమార్‌యాదవ్, రమేష్, సోహేల్, శివాజీ, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

రేపు రామకృష్ణమాచార్య జయంతి సభ

చిక్కడపల్లి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): నందూరి రామకృష్ణమాచార్య సాహిత్య క్షేత్రం, నవ్యసాహితీ సమితిల ఆధ్వర్యంలో ఈ నెల 29న మహాకవి డా. నందూరి రామకృష్ణమాచార్య 104వ జయంతి మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు పీఠం అధ్యక్షుడు కె.సాగరరావు, నవ్యసాహితీ సమితి అధ్యక్షుడు డా.ఆచార్య ఫణీంద్ర తెలిపారు. శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయంలో జరిగే ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఖజానా, లెక్కలశాఖ ఉప సంచాలకులు జి.వసుంధర ముఖ్యఅతిథిగా హాజరై ప్రముఖ రచయిత, ఆధ్యాత్మిక ప్రవచన కర్త వీఎస్ఆర్ మూర్తికి డా.నందూరి రామకృష్ణమాచార్య స్మారక పురస్కారాన్ని అందజేసి సత్కరిస్తారన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను శనివారం చిక్కడపల్లిలోని సమితి కార్యాలయంలో వారు ఆవిష్కరించారు.

సనత్‌నగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎన్నికల ఇన్‌చార్జ్‌గా వెంకటరెడ్డి



రాంనగర్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : సనత్‌నగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జ్‌గా అంబర్‌పేట నియోజకవర్గానికి చెందిన మాజీ కార్పొరేటర్ బి.వెంకట్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ శనివారం ప్రకటించారు. ఈ అవకాశం కల్పించిన కేటీఆర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

విముక్త చిరుతల కచ్చి పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఆంజనేయులు



రాంనగర్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : విముక్త చిరుతల కచ్చి పార్టీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పార్టీ సీనియర్ నాయకుడు ఎం.ఆంజనేయులు నియమితులయ్యారు. ఆయన నియామకాన్ని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్. జిలకర శ్రీనివాస్ శనివారం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ రాష్ట్రంలో పార్టీ పటిష్టత కోసం కృషి చేస్తామన్నారు.

రవిమన్యుకు ఇంటర్నేషనల్ అచీవర్ అవార్డు



అవార్డును అందుకుంటున్న రవిమన్యు

చిక్కడపల్లి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): సుస్వర సుగుణకళాభారతి సంస్థ అధ్యక్షుడు డా. రవిమన్యు గాయకుడు, చిత్రకారుడు, సేవాపరాయణుడుగా చేస్తున్న సామాజిక సేవలకు గుర్తుగా శనివారం యునైటెడ్ ఇంటర్నేషనల్ పీస్ కౌన్సిల్ మహాసభలో ఆయనకు ఇంటర్నేషనల్ అచీవర్ అవార్డును బహూకరించారు. నగరంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలు యూనివర్సిటీల ఆచార్యులు ఆయనకు ఈ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా రవిమన్యును పలురంగాల ప్రముఖులు అభినందించారు.

ఆధ్యాత్మిక సంస్కృతికి మూలం భారతీయ నృత్యం



కళాకారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న రచయిత గుండు వల్లీశ్వర్ తదితరులు

రాంనగర్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక సంస్కృతికి మూలం భారతీయ నృత్యం అని ప్రముఖ రచయిత గుండు వల్లీశ్వర్ పేర్కొన్నారు. నల్లకుంటలోని శంకర మఠంలో ఆకాంక్ష ఛారిటబుల్ ట్రస్ట్, శంకరమఠం సంయుక్త ఆధ్వర్యంలో శనివారం కూచిపూడి నృత్యప్రదర్శన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కూచిపూడి నృత్యం పట్ల పిల్లలకు చిన్నప్పటి నుంచే మక్కువ పెంపొందించాలన్నారు. బెంగళూరుకు చెందిన కళాకారిణి కీర్తన, శాన్వీ, తేజస్విని, వాన్య, పార్వతి తదితరులు చేసిన కూచిపూడి నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో శంకరమఠం ప్రధాన అధికారి కృష్ణారావు, లక్ష్మీనారాయణ, పద్మజ, పాలకుర్తి సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు. అనంతరం కళాకారులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.


వైభవంగా ముత్యాలమ్మ దేవాలయం వార్షికోత్సవం

చిక్కడపల్లి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్ ఆంధ్రాకేఫ్ వద్దనున్న శ్రీ ముత్యాలమ్మ దేవాలయం 24వ వార్షికోత్సవం శనివారం వైభవోపేతంగా జరిగింది. ఆలయ కమిటీ, గాంధీనగర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ దంపతులు పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు గడ్డం మధుసూదన్, బి.సంతోష్, జి.అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కూల్చివేసిన ఇళ్ల శిథిలాల తొలగింపు

● అడ్డుకున్న బాధితులను పీఎస్‌కు తరలింపు

● బాధితుల దీక్షాశిబిరం నేలమట్టం



ఇళ్ల శిథిలాల తొలగింపు వద్ద పోలీసు బందోబస్తు, జీహెచ్ఎంసీ సిబ్బంది

చిక్కడపల్లి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్‌లోని స్వామివివేకానందనగర్ బస్తీలో 75 సంవత్సరాలుగా ఇక్కడే నివసిస్తున్న వారి నివాసాలను కోర్టు ఆర్డర్‌తో గతంలో తొలగించిన ఇళ్ల శిథిలాలను శనివారం తెల్లవారుజామున భారీ పోలీసు బందోబస్తు మధ్య తొలగించారు. తమకు న్యాయం చేయాలని, ప్రత్యామ్నాయం చూపాలని లేదా కూల్చివేసిన ప్రాంతంలోనే పక్కా ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బాధితుల ఆధ్వర్యంలో గత 87 రోజులుగా కొనసాగుతున్న దీక్షాశిబిరాన్ని నేలమట్టం చేశారు. పోలీసులు, జీహెచ్ఎంసీ సిబ్బంది కలిసి కూల్చివేసిన ఇళ్ల శిథిలాలను పూర్తిగా తొలగించారు. అడ్డుకున్న బాధితులను అదుపులోకి తీసుకుని పీఎస్‌కు తరలించారు. బీజేపీ సికింద్రాబాద్ లోక్‌సభ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, దళిత బహుజన ఫ్రంట్(డీబీఎఫ్) జాతీయ ప్రధానకార్యదర్శి పి.శంకర్ తదితరులు చిక్కడపల్లి పీఎస్‌కు చేరుకుని బాధితులను పరామర్శించి, సంఘీభావం ప్రకటించారు. వినయ్‌కుమార్, శంకర్ మాట్లాడుతూ మూడు తరాలుగా ఇక్కడే నివసిస్తున్న వారి నివాసాలను అన్యాయంగా తొలగించారని ఆరోపించారు.

ఘనంగా బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం

బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గ పరిధిలో శనివారం ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్‌కు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు ఆయా ప్రాంతాల్లో పార్టీ జెండాలని ఆవిష్కరించారు.



రాంనగర్ చౌరస్తాలో ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు మిఠాయి తినిపిస్తున్న బీఆర్ఎస్ నాయకుడు

రాంనగర్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రాంనగర్ చౌరస్తాలోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద బీఆర్ఎస్ నగర నాయకుడు టి.శంకర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో జరిగిన బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు ఎమ్మెల్యే ముఠా గోపాల్ ముఖ్యఅతిథిగా హాజరై అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు ఎమ్మెల్యేలకు బిఠాయి తినిపించి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ముఠా జైసింహ, రాంనగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి దామోదర్ నాయుడు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అడిక్‌మెట్ డివిజన్‌లో

అడిక్‌మెట్ డివిజన్‌లోని రాంనగర్ మీ సేవ చౌరస్తాలో డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు బల్ల శ్రీనివాస్‌రెడ్డి, కె.సురేంద్ర ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమం ఎమ్మెల్యే ముఠా గోపాల్ ముఖ్యఅతిథిగా హాజరై జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నగర నాయకుడు సయ్యద్ ఆస్లాం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గోపాల్, ముఠా జైసింహ ప్రారంభించారు.

అంబర్‌పేటలో

బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అంబర్‌పేట ఛేనెంబర్‌లోని కార్యాలయంలో బీఆర్ఎస్ అంబర్‌పేట నియోజకవర్గం ఇన్‌చార్జి ఎడ్ల సుధాకర్‌రెడ్డి, నాయకులు గోపాల్, రాహుల్, మాధవరెడ్డి, ప్రకాష్, దయానంద్ తదితరులు కేక్ కట్ చేశారు.

కవాడిగూడ డివిజన్‌లో

కవాడిగూడ, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): కవాడిగూడ డివిజన్‌లో పార్టీ ప్రధాన కార్యదర్శి ఎన్‌డీ సాయికృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పార్టీ జెండాను ఎమ్మెల్యే ముఠాగోపాల్ ముఖ్య అతిథిగా హాజరై ఎగురవేశారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు శ్యామ్‌యాదవ్, ప్రభాకర్, శ్రీహరి, వెంకటేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గాంధీనగర్ డివిజన్‌లో

చిక్కడపల్లి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీ జెండాను ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యువనేత ముఠా జైసింహ, డివిజన్ పార్టీ అధ్యక్షుడు ముడారపు రాకేష్‌కుమార్, మాజీ కార్పొరేటర్ ముఠా పద్మనరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ముషీరాబాద్ డివిజన్‌లో

ముషీరాబాద్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు డి.శివముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ జెండాను ఎమ్మెల్యే ముఠాగోపాల్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీబీఆర్ఎస్ యువనేత ముఠా జైసింహ, ముషీరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్ రెడ్డి, అరుణ్ కుమార్, డివిజన్ ట్రేడ్ సెల్ అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థులను గెలిపించాలి

● మంత్రి శ్రీధర్‌బాబు



మంత్రి శ్రీధర్‌బాబు, అంజన్‌కుమార్‌యాదవ్‌తో శ్రీకాంత్ గౌడ్

ముషీరాబాద్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించి రాహుల్‌గాంధీని ప్రధానిని చేయాలని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. శనివారం ముషీరాబాద్‌కు చెందిన సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి లింగాల శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో మంత్రి శ్రీధర్‌బాబు, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్‌లను కలిశారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.... రాష్ట్రంలో కాంగ్రెస్‌కు అనుకూల వాతావరణం ఉందని ఎంపీ సీట్లు పెద్ద ఎత్తున గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మేడి పాపయ్య మాదిగ

బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలను బొందపెడతాం

● ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు సంపూర్ణ మద్దతు

● ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య మాదిగ

బర్కత్‌పుర, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మాదిగలను మోసం చేసిన బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలను బొందపెడతామని, గ్రామాలకు రాకుండా తరిమికొడతామని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎమ్మార్పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య మాదిగ హెచ్చరించారు. పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలోని మాదిగలంతా కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ మద్దతు తెలుపుతున్నారని అన్నారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డిని కలిసినప్పుడు ఎన్నికల తర్వాత మాదిగలకు ఒక రాజ్యసభ, రెండు ఎమ్మెల్సీ, నామినేటెడ్ పోస్టులలో ప్రాధాన్యం కల్పిస్తామని స్పష్టమైన హామీ ఇవ్వడం వల్ల ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలపాలని నిర్ణయించామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 17 ఎంపీ స్థానాలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామన్నారు. ఈ నెల 28 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం ప్రారంభిస్తున్నామని, సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నామని అన్నారు. వర్గీకరణపై బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల మోసాలను ఎండగడతామని, కాంగ్రెస్ పార్టీ ద్వారానే వర్గీకరణ సాధ్యమవుతుందన్నారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు సంద్రపల్లి వెంకటయ్య, డాక్టర్. మేడి రమణ, కె. మోహన్, చింతబాబు మాదిగ, నాగారం బాబు, ఎం. యాదగిరి, ఎం. శ్రీనివాస్, మహిళా నాయకురాలు అందె రుక్కమ్మ, అమృత, జ్యోతి పాల్గొన్నారు.

ఎంపీ ఎన్నికల్లో బీజేపీకి గుణపాఠం చెప్పాలి : సుభాష్

నల్లకుంట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి గుణపాఠం చెప్పాలని టీపీసీసీ ఓబీసీ సెల్ వైస్ చైర్మన్ కట్టెల సుభాష్ అన్నారు. శనివారం హైదర్‌గూడలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు హరినాథ్‌రెడ్డి, మురళీ, ప్రభుదాస్, జనార్దన్‌రెడ్డిలతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. డాక్టర్. బీఆర్ అంబేడ్కర్ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీలకు కల్పించిన హక్కులను మోదీ కాలరాయడానికి ప్రయత్నిస్తున్నారని, ఈ విషయం ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రజలు ఈ ఎన్నికల్లో బీజేపీకి ఓటు ద్వారా గుణపాఠం చెప్పాలని ఆయన సూచించారు.

'బీసీ రిజర్వేషన్లు పెంచి స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలి'

చిక్కడపల్లి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): బీసీ జనగణన పూర్తిచేసి, బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచిన తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆరె మహేందర్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ప్రకటించినట్టుగా మాట నిలబెట్టుకోవాలని కోరారు. శనివారం చిక్కడపల్లిలో జరిగిన బీసీ ఐక్యవేదిక సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంబీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలని కోరారు. మూడు లక్షల వార్షికాదాయం ఉన్న బీసీ విద్యార్థులకు ర్యాంకుతో సంబంధం లేకుండా పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రభుత్వమే భరించాలని కోరారు. పార్టీలకు అతీతంగా బీసీలను గెలిపించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ ఐక్యవేదిక రాష్ట్ర కోఆర్డినేటర్ దశరథం పటేల్, హైదరాబాద్ జిల్లా కోఆర్డినేటర్ రాజీవ్‌పటేల్, ప్రశాంత్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

● సేవ్ వాటర్



గోల్నాక డివిజన్‌లోని జేస్వాల్‌గార్డెన్ కాలనీలో లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ విద్యార్థులు సేవ్ వాటర్ అనే నినాదంతో కాలనీలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఉపేందర్, ప్రిన్సిపాల్ కృష్ణవేణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- గోల్నాక, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి)

1 నుంచి పబ్లిక్ గార్డెన్‌లో మార్నింగ్ వాక్ పోటీలు

బర్కత్‌పుర, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): హెల్త్ ఇండియా వెల్త్ ఇండియా అనే నినాదంతో ప్రజలలో వ్యాయామం పట్ల పూర్తి అవగాహన పెంపొందించడానికి మే 1 నుంచి 30వ తేదీ వరకు నెల రోజుల పాటు మార్నింగ్ వాక్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జాగో ఇండియా జాగో ఫౌండేషన్ ట్రస్ట్ ట్రస్టీ జావేద్ షరీఫ్ తెలిపారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 5 ఏళ్ల వయసు నుంచి 60 ఏళ్ల వృద్ధుల వరకు ఈ మార్నింగ్ వాక్ పోటీలలో పాల్గొనవచ్చని తెలిపారు. నాంపల్లి పబ్లిక్ గార్డెన్‌లో ప్రతి రోజూ ఉదయం 5 నుంచి 7 గంటల వరకు ఈ మార్నింగ్ వాక్ పోటీలు ఉంటాయని తెలిపారు. కనీసం 28 రోజులు మార్నింగ్ వాక్‌లో పాల్గొన్న పేర్లను డ్రాలో వేసి మే 30న ఒకరిని విజేతగా ప్రకటిస్తామన్నారు. విజేతకు ట్రస్ట్ తరఫున రూ.50 వేల చెక్కును అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సభ్యులు సయ్యద్, అక్బర్, సర్దార్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మతమార్పిడికి యత్నించిన ఇద్దరి అరెస్ట్

కవాడిగూడ, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): వేసవి శిబిరాలను ఆసరాగా చేసుకొని చిన్నారులతో అన్యమత ప్రార్థనలు చేయిస్తూ మతమార్పిడికి పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను దోమలగూడ పోలీసులు అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. ఫూల్‌బాగ్‌కు చెందిన డి.రమేష్, హిమాయత్‌నగర్‌లో నివాసముంటున్న జగ్గయ్యపేటకు చెందిన కావేటి ప్రసాద్ సెయింట్ ఆంథోని స్కూల్ పిల్లలు, బీమా బస్తీ పిల్లలకు రోజూ వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. వీరి వద్ద బీమామైదాన్‌లో నివాసముంటున్న రవి, రాజుల పిల్లలు శిక్షణ పొందుతున్నారు. పిల్లలతో వీరిద్దరూ అన్యమత ప్రార్థనలు చేయిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న పిల్లల తల్లిదండ్రులు శనివారం ఉదయం రమేష్, కావేటి ప్రసాద్‌ను నిలదీశారు. వారి ప్రవర్తనపై అనుమానంతో దోమలగూడ పోలీసులు, భజరంగ్‌దళ్ నాయకులకు ఫిర్యాదుచేశారు. పోలీసులు రమేష్, కావేటి ప్రసాద్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఎన్‌టీఆర్ స్టేడియం, బీమా మైదాన్ పరిసర ప్రాంతాల్లో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.

క్లినిక్‌లో యాంటీబయాటిక్స్ స్వాధీనం

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): క్లినిక్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన యాంటీబయాటిక్స్‌ను ఔషధ నియంత్రణ సంస్థ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ముషీరాబాద్ పరిధిలోని గాంధీనగర్‌లో ఓ క్లినిక్‌లో అక్రమంగా భారీ ఎత్తున్న యాంటీబయాటిక్స్ నిల్వ ఉంచారు. సమాచారం అందుకున్న అధికారులు ఆ క్లినిక్‌లో నిర్వహించిన దాడుల్లో యాంటీబయాటిక్స్, అనాల్జెసిక్స్, దగ్గు సిరప్‌లు, యాంటీ అల్సర్ డ్రగ్స్, యాంటీహైపెర్టెన్సివ్ తదితర మందులను నిల్వ ఉన్నట్లు గుర్తించారు. దాదాపు రూ.90 వేల విలువైన మందులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఎక్స్‌కవేటర్ ఢీకొని ఉల్లిగడ్డ వ్యాపారి దుర్మరణం

అంబర్‌పేట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): బతుకుదెరువు కోసం తెల్లవారుజామున తోపుడు బండిపై ఉల్లిగడ్డలు అమ్మడానికి వెళ్లిన ఓ చిరు వ్యాపారి ఎక్స్‌కవేటర్ ఢీకొని దుర్మరణం పాలైన సంఘటన అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం. అంబర్‌పేట న్యూఅంబేడ్కర్‌నగర్‌కు చెందిన మహ్మద్ జిలాని(56) తోపుడు బండిపై ఉల్లిగడ్డలు అమ్ముతూ జీవనం కొనసాగిస్తాడు. శనివారం తెల్లవారుజామున తన కుమారుడు మహ్మద్ ఇస్మాయిల్‌తో కలిసి తోపుడుబండిపై ఉల్లి గడ్డలు అమ్మడానికి వెళ్లాడు. 5.30 గంటల సమయంలో జిందాతిలస్మాత్ నుంచి ఛేనెంబర్ వైపునకు రోడ్డు దాటుతుండగా వెనక నుంచి వేగంగా వచ్చిన ఎక్స్‌కవేటర్(టీఎస్ 05 ఈపీ 6022) ఢీకొట్టింది. ఈ ఘటనలో తోపుడు బండి వెనుక వైపు ఉన్న మహ్మద్ జిలానికి తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని వెంటనే ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఎక్స్‌కవేటర్ డ్రైవర్ జార్ఖండ్‌కు చెందిన సమరుల్లా అన్సారీని అంబర్‌పేట పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

బర్కత్‌పుర, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. కాచిగూడ రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. గుర్తు తెలియని వ్యక్తి(50) బుద్వేల్ - ఉందానగర్ రైల్వే స్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.